క్లుప్తంగా

విశేషంగా సుందరకాండ పారాయణ



సుందరకాండ పారాయణ నిర్వహిస్తున్న మహిళలు

సింహాచలం: సింహగిరి మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6.30 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, 7గంటలకు సహస్రనామార్చన, ఉదయం 9 నుంచి శ్రీరామ పట్టాభిషేక సర్గపారాయణ, 9.30గంటలకు పూర్ణాహుతి నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు స్వామికి అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. మహిళలు సామూహికంగా సుందరకాండ పారాయణ చేశారు.

నేడు అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



అభయాంజనేయస్వామి ఆలయం

పెందుర్తి: మండలంలోని పినగాడి దరి వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా హాజరు కావాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పెందుర్తి మండలం ముదపాక, బొడ్డునాయుడుపాలెం, గోవిందపురంలో శుక్రవారం పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు, ఫలితాల నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రలతకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ముదపాక పంచాయతీ పరిధిలో ఐదుగురుని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

సమన్వయంతో లెక్కింపు ప్రక్రియ

- కౌంటింగ్ ఏజెంట్లు, అధికారుల పాత్ర కీలకం
- నిబంధనల మేరకు ఎలాంటి అభ్యంతరమైనా స్వీకరిస్తాం
- రాజకీయ నాయకులు సహకరించాలి
- ఏజెంట్ల సమావేశంలో ఆర్వో శైవశైలజ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో శేష శైలజ

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4న జరగనున్న పెందుర్తి నియోజకవర్గ ఓట్ల లెక్కింపును అధికారులు, కౌంటింగ్ ఏజెంట్లు సమన్వయంతో విజయవంతం చేయాలని రిటర్నింగ్ అధికారి శేష శైలజ కోరారు. లెక్కింపులో అధికారులతో పాటు కౌంటింగ్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. స్థానిక మహిళా ప్రగతి కేంద్రంలో శుక్రవారం ఎన్నికల లెక్కింపు రోజు వ్యవహరించాల్సిన అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే జాతీయ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి కచ్చితంగా పరిగణలోకి తీసుకుంటామన్నారు. ప్రతి ఓటు కీలకం కాబట్టి అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల అభ్యంతరాలను స్వీకరించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్య పరిష్కారానికి తక్షణమే కృషి చేస్తామన్నారు. లెక్కింపు సమయంలో కౌంటింగ్ కేంద్రం వద్ద, నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రత అంశాన్ని దృష్టిలో పెట్టుకుని 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లెక్కింపు సమయంలో సహనంతో ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలోనూ వివాదస్పద, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కౌంటింగ్ ఏజెంట్ల సందేహాలను ఆర్వో నివృత్తి చేశారు. వైఎస్సార్‌సీపీ, జనసేన, కాంగ్రెస్ తో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థుల తరఫున ఏజెంట్లు సమావేశంలో పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

- అల్లర్లు సృష్టిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోం
- ఫలితాల రోజు ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదు
- పక్కాగా 144 సెక్షన్ అమలు చేస్తాం
- అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారించామని జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా, ఆ తర్వాత రోజుల్లో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. చినముషిడివాడలోని ఓ కల్యాణ మండపంలో రాజకీయ పక్షాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు తమ నాయకులు, కార్యకర్తలకు శాంతి భద్రతల పరిరక్షణపై తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం లెక్కింపు రోజున ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలో 144 సెక్షన్ పక్కాగా అమలు చేస్తామన్నారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఎక్కడ ఉన్నా అదుపులోనికి తీసుకుంటామని చెప్పారు. శాంతి భద్రతలను కాపాడేందుకు రాజకీయ పక్షాలు, ప్రజలు తమకు సహకరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ నాయకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ అశిరితాత, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



కుంకుమ పూజ నిర్వహిస్తున్న దంపతులు



అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న చండీ హోమం

సబ్బవరం: మండంలోని పెదగొల్లలపాలెంలో కొలువైన పైడితల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి దూపదీప నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా 108 కలశాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి,చండీ హోమం,చండీ పారాయణ నిర్వహించారు. దంపతులతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. సహస్రనామార్చన,దీపాలంకరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. శ్రీకాకుళం వారిచే కూచిపూడి ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారిని గ్రామ పెద్దలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు,బండారు సత్యనారాయణమూర్తి తదితరులు దర్శించుకున్నారు.

ఎన్టీపీసీలో ముగిసిన స్వచ్ఛతా పక్వాడ



మొక్కకు నీరందిస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా



టౌన్‌షిప్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మే 16న ప్రారంభించిన కార్యక్రమాన్ని 15 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగించారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులతో స్వచ్ఛత పక్వాడ ప్రతిజ్ఞ చేయించారు. సెమినార్లు, క్లీనెస్‌డ్రైవ్, ప్రభాత్ ఫెరిస్, అవగాహన ప్రసారాలు, బీచ్‌లు క్లీనింగ్‌లు, చెట్ల పెంపకం పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎన్టీపీసీ ఉద్యోగుల కుటుంబాలు, జెమ్ విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పరవాడ: నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్‌నగర్, సమ్మెంగపాలెం, జాలరిపేట, మంగప్పయ్యగారి గ్రామం, కోరింగిపాలెం గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

జూనియర్ ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు



సీట్లు పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న రూపవతి

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ శుక్రవారం నిర్వహించారని, ఈ కౌన్సెలింగ్ ఉమ్మడి జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్ రూపవతి చైర్మన్‌గా వ్యవహరించారని మేహాద్రి గెడ్డ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ మృదుల ప్రియదర్శిని తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 7 మహిళా గురుకులాల్లో జూనియర్ ఇంటర్‌లో సీట్ల భర్తీకి అడ్మిషన్ కౌన్సెలింగ్ స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. జిల్లలో మేహాద్రి గెడ్డ, సీవోఈ మధురవాడ, నక్కపల్లి, కోనాం తాళ్లపాలెం, నర్సీపట్నం, కొక్కిరాపల్లి గురుకులాల్లో 73 సీట్లను గాను సుమారు 200 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ ఖాళీలు మెరిట్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా భర్తీ చేశారు. పలు గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ జి.గ్రేస్, టి నాగమణి, కె.సువర్ణ రత్న కుమారి, సీహెచ్ హిమవతి కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

చెరుకు సాగుతో లాభాలు



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ జగన్నాథరావు

సబ్బవరం: చెరుకుకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉండడంతో రైతులు తమ సాగు విస్తీర్ణం పెంచుకొని లాభాలు గడించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. సబ్బవరం జాగృతి సొసైటీ కేంద్రంలో శుక్రవారం అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో అఖిల భారత సమన్వయ పథకం ద్వారా షెడ్యూల్ కుల చెరుకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చెరుకు సాగుకు మేలైన రకాలు ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బెల్లం తయారీకి అనువైన సాగు రకాల గురించి వివరించారు.చెరుకును ఆశించే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం చెరుకు సాగు చేస్తున్న రైతులకు 15 బస్తాల యూరియా,సూపర్ పాస్పేట్ బ్యాగ్-1, వర్మీ కంపోస్టు బ్యాగ్‌లు-10,స్ప్రేయర్స్-5,స్టీల్ బకెట్లు -10,బెల్లం అచ్చులు,మందులు కలుపుకోవడానికి 10 డ్రమ్ములు అందజేశారు. కార్యక్రమంలో జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆదిలక్ష్మి,విశాలాక్షి,సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్, జాగృతి కన్సెల్టెంట్ వీవీ సుబ్రహ్మణ్యం, జాగృతి సీఈవో కేవీఎస్ మౌక్తిక,రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలు,ఫీల్డ్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

డాక్టర్ బాబ్జీకి బాల సాహిత్య సేవారత్న అవార్డు



డాక్టర్ వరప్రసాద్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ బాబ్జీ

మద్దిలపాలెం: మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, కవి, రచయిత, కళాకారుడు డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి మరో అవార్డు దక్కింది. హైదరాబాద్ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సేవారత్నం అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, డాక్టర్ వరప్రసాద్ రెడ్డి చేతులమీదుగా శుక్రవారం ఆయన ఈ అవార్డును స్వీకరించారు. తనకు ప్రతిష్టాత్మక పురస్కారం అందించిన సారస్వత పరిషత్ ప్రతినిధులకు డాక్టర్ బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు చెందిన వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ఆయన్ని అభినందించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జితసేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.